క్లుప్తంగా

జేబీకే పురం రైల్వేగేటు మూసివేత

- మరమ్మతుల నిమిత్తం మూడు రోజులపాటు..

కంభం: మండలంలోని చిన్నకంభం సమీపంలో ఉన్న జగ్గంబొట్ల కృష్ణాపురం రైల్వే గేటు(నెం.217) వద్ద ట్రాక్ మరమ్మతు పనుల నిమిత్తం ఈనెల 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 21వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గేటు మూసి వేస్తున్నట్లు రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంభం నుంచి తురిమెళ్ల, రాచర్ల, గిద్దలూరు వైపు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామంలోగుండా రైల్వే గేటు నంబర్ 216 మీదుగా వెళ్లాలని సూచించారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి, రైల్వే అధికారులకు సహకరించాలని కోరారు.

ఉద్యోగుల పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

గిద్దలూరు రూరల్: రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఉగాది కానుకగా పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేసి, వెంటనే ఐఆర్ వెంటనే ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని ఏపీటీఎఫ్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కొత్త ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెట్టుకున్న ఆశలు అడియాసలయ్యాయని పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలని ఏపీటీఎఫ్ సభ్యులు డిమాండ్ చేశారు.

'వెలిగొండ' సమస్యలపై ధర్నాను జయప్రదం చేయండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న బాలనాగయ్య

మార్కాపురం టౌన్: పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో మరో రూ.1500 కోట్లు కేటాయించి, నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 20న చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గుమ్మా బాలనాగయ్య కోరారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా మంగళవారం మండలంలోని వేములకోట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మార్కాపురం మెడికల్ కళాశాలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే నిర్మించి, నిర్వహించాలని డిమాండ్ చేశారు. వేములపేట, చింతగుంట్ల మధ్యలో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు కేటాయించాలని కోరారు.

అల్లూరులో జిల్లా స్థాయి భజన పోటీలు

కొత్తపట్నం: శ్రీరామనవమి సందర్భంగా మండలంలో అల్లూరు గ్రామంలో సీతాసమేత కోదండరామస్వామి వారి దేవస్థానంలో జిల్లాస్థాయి భజన పోటీలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏడాది పోటీలు జరుగుతాయని అందులో భాగంగా ఈ ఏడాది కూడా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఏప్రిల్ 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటలకు పోటీలు ఉంటాయన్నారు. వివిధ రకాల పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ. 25 వేలు కే పల్లెపాలెం గ్రామానికి చెందిన లంకే మురళీ, రెండో బహుమతి రూ. 20 వేలు శింగమనేని చంద్రశేఖర్ దంపతులు, మూడో బహుమతి రూ.15 వేలు కే పల్లెపాలెం గ్రామానికి చెందిన నాయుడు వెంకటేశ్వర్లు, నాలుగో బహుమతి రూ.10 వేలు అల్లూరు గ్రామానికి చెందిన గుత్తికొండ శ్రీనివాసులురెడ్డి సొంత నగదుతో బహూకరిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు భజన పోటీలో పాల్గొనాలని కోరారు. వివరాలకు 98496 00159, 99511 60038 నంబర్లలో సంప్రదించాలని కమిటీ సభ్యులు కోరారు.

నీడకు జాడేది?

- మార్కాపురంలోని ప్రధాన సెంటర్లలో బస్ షెల్టర్లు లేకఇక్కట్లు
- ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులకు నిత్యం అవస్థలు
- దుకాణాల వద్ద తలదాచుకుంటున్న వైనం
- దాతల సాయంతోనైనా బస్ షెల్టర్లు నిర్మించాలని వినతి



దోర్నాల సెంటర్‌లో ప్రయాణికుల పడిగాపులు

మార్కాపురం:

డివిజన్ కేంద్రమైన మార్కాపురం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి కాలం కావడంతో ఉదయం 8 గంటలకే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. మార్కాపురం పట్టణం నుంచి ఉదయం పూట పలువురు ప్రభుత్వ ఉద్యోగులు కంభం, బేస్తవారపేట, గిద్దలూరు, పెద్దారవీడు, పెద్దదోర్నాల, యర్రగొండపాలెం ప్రాంతాలకు వెళ్తుంటారు. సాయంత్రం వేళ చింతగుంట్ల, నికరంపల్లి, సుంకేశుల, గుండంచర్ల, కోలభీమునిపాడు, జమ్మనపల్లి గ్రామాలకు వెళ్లేందుకు విద్యార్థులు బస్ కోసం వేచి ఉంటారు. ఆయా సమయాల్లో నీడ కోసం బస్ స్టాప్ సమీపంలోని దుకాణాలు, టీ బంకుల వద్ద తలదాచుకుంటున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు నిలిపే దోర్నాల సెంటర్, కంభం సెంటర్, కోర్టు సెంటర్‌లలో బస్‌షెల్టర్లు లేవు.

☛ దోర్నాల సెంటర్ బస్ స్టాప్ లో త్రిపురాంతకం, వినుకొండ, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, యర్రగొండపాలెం, మాచర్ల, హైదరాబాద్, దోర్నాల, శ్రీశైలం, పెద్దారవీడు, కర్నూలు, ఆత్మకూరు వెళ్లే ప్రయాణికులతో పాటు దగ్గర గ్రామాలైన దేవరాజుగట్టు, గొబ్బూరు, తోకపల్లె గ్రామాల ప్రయాణికులు బస్సుల కోసం వేచి ఉంటారు.

☛ కోర్టు సెంటర్ వద్ద బస్టాప్‌లో ఒంగోలు, తిరుపతి వెళ్లే ప్రయాణికులతో పాటు కలుజువ్వలపాడు, కొనకనమిట్ల, పొదిలి, రైల్వేస్టేషన్, గజ్జలకొండ తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు ఉంటారు.

☛ మార్కాపురం డిపోలో 97 బస్సులు ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు ప్రతి రోజు చేరవేస్తుంటాయి. కంభం సెంటర్ బస్ స్టాప్‌లో కంభం, నంద్యాల, కడప, ప్రొద్దుటూరు, గిద్దలూరు వెళ్లే దూరప్రాంత ప్రయాణికులతోపాటు చింతగుంట్ల, జంగంగుంట్ల, జమ్మనపల్లె, గొట్టిపడియ, కోలభీమునిపాడు వెళ్లే ప్రయాణికులు ఈ సెంటర్‌లో ఆగుతారు.

☛ ఈ ప్రాంతాల్లో ఆర్టీసీ అధికారులు బస్ షెల్టర్ల నిర్మాణంపై దృష్టి సారించకపోవటంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఎండ వేడిమికి తట్టుకోలేక దగ్గరలో ఉన్న షాపుల పంచన ఆశ్రయం పొందాల్సి వస్తోంది. ఒక్కోసారి వ్యాపారుల నుంచి ప్రయాణికులకు చీత్కారాలు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి దాతల సహకారంతో అయినా బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కంభం బస్టాండులో వేచి ఉన్న విద్యార్థులు, ప్రయాణికులు

వైఎస్ జగన్‌ను కలిసిన అన్నా రాంబాబు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అభివాదం చేస్తున్న అన్నా రాంబాబు

మార్కాపురం: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మంగళవారం మేదరమెట్లలో ఆ పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయన వెంట ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, మార్కాపురం వైఎస్సార్ సీపీ నేత చాతరాజుపల్లి శ్రీనివాసులు, తర్లుపాడు నాయకులు రామసుబ్బారెడ్డి, మురారి వెంకటేశ్వర్లు, కేకేమిట్ల ఎంపీపీ మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు ఉన్నారు.

కాటంరాజు తిరునాళ్లకు ఏర్పాట్లు



కాటంరాజు చరిత్రను చూపుతున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మార్కాపురం: ఈనెల 29న కాటంరాజు, గంగాభవాని తిరునాళ్లకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ ప్రతినిధి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి పిన్నిక లక్ష్మీప్రసాదయాదవ్, కమిటీ అధ్యక్షుడు వెంకటరావు యాదవ్ తెలిపారు. మంగళవారం బీసీ భవన్‌లో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరునాళ్లకు వచ్చే భక్తుల కోసం భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు అన్నదానం చేయడంతోపాటు మినరల్ వాటర్ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసేవారు కమిటీని సంప్రదించాలని సూచించారు. కాటంరాజు స్వామివారి చరిత్రను రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు తంగిరాల సుబ్బారావు రచించగా పుస్తక రూపంలోకి తెస్తున్నామన్నారు. ఆలయం వద్ద భోజనశాలను దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పి.పోలురాజు, ఒ.నాగేశ్వరరావు, జి.గంగరాజు, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, ఎ.శ్రీనివాస్ యాదవ్, నాగం వెంకటేష్, గాలెయ్య, గోపాల్‌రాజు, ముప్వా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

21న అభయాంజనేయ స్వామి తిరునాళ్ల



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వేమన



అభయాంజనేయ స్వామి

పొదిలి రూరల్: పొదిలి మండలం ఏలూరు పంచాయతీలోని ఒంగోలు–కర్నూలు రహదారి ముసి బ్రిడ్జి వద్ద కొలువై ఉన్న అభయాంజనేయస్వామి, వరసిద్ధి వినాయక స్వామి తిరునాళ్ల ఈ నెల 21వ తేదీ నిర్వహించనున్నట్లు దేవస్థానం కమిటీ కార్యనిర్వాహకులు ధర్మవరపు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు ఆకుపూజ, మధ్యాహ్నం, సాయంత్రం ఆలయం వద్ద ఉన్న కాశీ నాయనసత్రంలో అన్న సంతర్పణ చేయనున్నట్లు వివరించారు. రాత్రికి ఏలూరు గ్రామంలో విద్యుత్ ప్రభలు, కోలాటం, బ్రహ్మంగారి నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా మంగళవారం ఆలయ పరిసరాలు, ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసే ప్రదేశాలను ఎస్సై వేమన పరిశీలించారు. శాంతియుత వాతావరణంలో తిరునాళ్ల నిర్వహించేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు.

బేస్తవారిపేటలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ బీవీ రాజయ్య

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: రబీలో సాగు చేసిన శనగ, కంది పంట ఉత్పత్తుల విక్రయానికి బేస్తవారిపేటలో ఏపీ మార్క్‌ఫెడ్–నాఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. కొనుగోలే కేంద్రాల ఏర్పాటులో జాప్యం, రైతుల ఇబ్బందులపై 'మద్దతు కరువై.. రైతు గుండె బరువై..' శీర్షికన 'సాక్షి'లో ఈనెల 17న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జెడ్పీటీసీ బీవీ రాజయ్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. శనగ, కంది పంటలు సాగు చేసిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కందులకు మద్దతు ధర రూ.7,550, శనగలకు రూ.5,650 ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ ఎంపీ అరుణకుమారి, సీఈఓ రామిరెడ్డి, సొసైటీ బ్యాంక్ మాజీ అధ్యక్షుడు బారెడ్డి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

బయనపల్లె మహిళకు గణితంలో డాక్టరేట్



డాక్టరేట్ పొందిన వనజగోష్టి

గిద్దలూరు రూరల్: మండలంలోని ఎస్.బయనపల్లెకు చెందిన బి.వనజగోష్టి గణితశాస్త్రంలో డాక్టరేట్ పట్టా పొందారు. గణిత శాస్త్రంలో 'ఎఫెక్ట్స్ ఆఫ్ బౌండరీ స్లిప్ అండ్ వేరియబుల్ ఫిజికల్ ప్రాపర్టీస్ ఆన్ హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టు ఫ్లూయిడ్ ఫ్లోస్ ఇన్ ఏ వర్టికల్ చానల్' అంశంపై వనజగోష్టి చేసిన పరిశోధనకుగాను సత్యసాయి జిల్లాలోని భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ డాక్టరేట్ అందజేసింది. ఈ సందర్భంగా ఆమెను వైఎస్సార్ సీపీ ఆర్యవైశ్య విభాగం నాయకులు పెండేల కిరణ్‌కుమార్, తుమ్మలపెంట సురేష్, దుర్గారావు, సత్యనారాయణ, కంచర్ల రవి అభినందనలు తెలియజేశారు.

జనం ఉక్కిరిబిక్కిరి!



ఎండ దెబ్బకు జనసంచారం తక్కువగా ఉన్న కంభం రోడ్డు

మార్కాపురం: వేసవి మొదలై ఎండలు దంచికొడుతున్నా.. రాత్రి వేళ చలి వీడటం లేదు. తెల్లవారుజామున మంచు కురవడం.. ఉదయం 8 నుంచే భానుడు నిప్పులు చెరుగుతుండటంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి 20 రోజుల ముందుగానే అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మార్కాపురం పట్టణంలో మంగళవారం 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



మంచు కురుస్తుండటంతో లైట్ల వెలుగులో వాహనాలు

రోడ్డెక్కిన విద్యుత్ మీటర్ రీడర్లు



ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న మీటర్ రీడర్లు

మార్కాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ మీటర్ రీడర్లు మంగళవారం స్థానిక తర్లుపాడు రోడ్డులోని విద్యుత్ ఈఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు అందె నాసరయ్య, ఎస్కే ఖాశిం మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా మీటర్ రీడర్లు విధి నిర్వహణలో అనేక ఇబ్బందులు పడుతున్నారని, శ్రమకు తగిన వేతనం అందక, ఉద్యోగ భద్రత లేక దినదినగండంగా జీవిస్తున్నారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు వేతనం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నారాయణ, సతీష్, సుబ్రహ్మణ్యం, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు జాబితా సరిచూసుకోండి



బేస్తవారిపేట : పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్, ఏఓ మెర్సీ



మార్కాపురం : రైతులతో మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసులు

- ఏడీఏ బాలాజీనాయక్

బేస్తవారిపేట: పంట నమోదు చేయించుకున్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో జాబితాను సరిచూసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ డి.బాలాజీనాయక్ సూచించారు. మంగళవారం జేబీకే పురం, చెట్టిచర్లలో గ్రామ సభలు నిర్వహించారు. జాబితాలో తప్పులు ఉంటే ఈనెల 22వ తేదీలోగా వీఏఏలకు అర్జీలు అందజేయాలని తెలిపారు. కందులు, శనగ పంట కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. పంట ఉత్పత్తులను విక్రయించే రైతులు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ జక్కం మెర్సీ, ఏఈఓ ఆదిగణేష్ పాల్గొన్నారు.

బిందు సేద్యంతో ఎన్నో లాభాలు

కొమరోలు: బిందు సేద్యం పద్ధతిలో పంటలు పండిస్తే రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని ఏడీఏ బాలాజీనాయక్ తెలిపారు. మండలంలోని అల్లినగరం, గోనపల్లె గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. భూగర్భ జలాలు తగ్గుతున్నందున పంటలకు నీటిని సమర్థవంతంగా అందించేందుకు బిందు సేద్యం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. రాయితీలను వినియోగించుకోవాలని సూచించారు. ఏఓ రాజశ్రీ, ఏపీఎంఐపీ ఏరియా ఆఫీసర్ మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు సమాయత్తంకండి

మార్కాపురం టౌన్: ఖరీఫ్ సీజన్‌కు రైతులు సమాయత్తం కావాలని వ్యవసాయాధికారి డి.శ్రీనివాసులు సూచించారు. మంగళవారం జమ్మనపల్లి, కోలభీమునిపాడు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మే నెలలో రైతులు తమ పొలాలను లోతు దుక్కులు చేసుకోవాలని, భూమి సారవంతం కావాలంటే పచ్చిరొట్ట పైర్లు సాగు చేసి పూత దశలో భూమిలో కలియదున్నాలని సూచించారు.

వెలుగొండ తిరునాళ్లకు పటిష్ట బందోబస్తు



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్సై రాజ్‌కుమార్

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండలో ఈ నెల 21, 22, 23వ తేదీల్లో నిర్వహించే శ్రీవారి బ్రహ్మోత్సవ తిరునాళ్లకు పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కుందురు కాశిరెడ్డితో కలిసి వెలుగొండ క్షేత్రంలో పర్యటించారు. ఎడ్ల పోటీలు, అన్నదాన సత్రాల నిర్వహణ, తిరునాళ్లలో షాపుల ఏర్పాటు, ట్రాఫిక్ తదితర అంశాలు, ఇతర ఏర్పాట్లపై ఈఓ చెన్నకేశవరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులతో చర్చించారు. మూడు రోజులపాటు తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఎస్సై వెల్లడించారు.